క్లుప్తంగా

గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజలో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: సంకష్టహర చతుర్థిని పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలోని వినాయక గంజ్ ఆవరణలోని గణపతి ఆలయంలో సాయిమిత్ర అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు వేణుగోపాల్, ఖాజాపాషా, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, కోటిలింగంగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రవీణ్, అభిలాశ్, మహేశ్, శ్రీధర్, సుదీప్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలకు చెక్



సీసీ కెమెరాలు అందజేస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని బొదనంపల్లి గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ సీల లావణ్య పాండు సహకారంతో శుక్రవారం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించవచ్చని అన్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం అని అన్నారు. ప్రతీ ఒక్కరు తమ ఇంటి ఆవరణలో విధిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగారెడ్డి, కానిస్టేబుల్ అశోక్‌రెడ్డి, గ్రామస్తులు మల్లేశ్, మహేశ్, శ్రీకాంత్, రవీందర్‌రెడ్డి, సాయిలు, యాదయ్య, నర్సింహ, కృష్ణయ్య, నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

దాతల చేయూత అభినందనీయం

మండల విద్యాధికారి పురన్‌దాస్



విద్యార్థులకు యూనిఫాం, షూ అందజేస్తున్న దాతలు, ఎంఈఓ

చేవెళ్ల: పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి ఎల్.పురన్‌దాస్ అన్నారు. మండల పరిధిలోని ఎన్కేపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు కమల, ఆమె భర్త రిటైర్డ్ ఉద్యోగి మనోహర్ పాఠశాల విద్యార్థులకు యూనిఫాం, షూ అందజేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ.. తాను పనిచేస్తున్న పాఠశాల విద్యార్థులకు సహకారం అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సహోపాధ్యాయుడు మునీర్‌పాషా, విద్యార్థులు, పంచాయతీ కార్యదర్శి రేణు, అంగన్‌వాడీ కార్యకర్త స్వరూప, ఆశ కార్యకర్త సుజాత, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ప్రవీణ్‌కుమార్ తదితరులు

షాద్‌నగర్: పట్టణంలోని ఏడవ వార్డు న్యూ భాగ్యనగర్ కాలనీ నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాంగ్రెస్ నేత కొప్పునూరు ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని అన్నారు. కాలనీలో వాసుల కోరిన వెంటనే ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించడం హర్షనీయమన్నారు.

సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రజాపాలన ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ముద్వీన్ గ్రామానికి చెందిన దాదాపు 25 మంది బీజేపీ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ప్రజాపాలనకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఆయన చెప్పారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

నల్లబడుతున్న తెల్ల బంగారం

అధిక వర్షాలతో నష్టపోతున్న రైతులు

- అప్పులు తీర్చే మార్గం లేదని ఆవేదన చెందుతున్న కర్షకులు
- చేతికొచ్చిన పంట నష్టపోతున్నామని ఆందోళన



ఆలూరులో వర్షాలకు పాడైన పత్తిపంట

చేవెళ్ల: తెల్లబంగారం పండించే రైతు మోము నల్లబారుతోంది. పత్తి సాగుతో లాభాలు ఆర్జించి అప్పులు తీర్చాలని ఆశలను వర్షాలు అడియాశలు చేస్తున్నాయి. చేతికి వచ్చే దశలో పంట పాడవడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు. అధిక వర్షాల కారణంగా లోతట్టు ప్రాంతాల పంటలు పాడవగా ఒకింత తట్టుకున్న పత్తి కాయలు వర్షాలు వెంటపడడంతో నల్లబారుతున్నాయి. నల్లబారిన పంటకు మద్దతు ధర అందక రైతులకు నష్టాలు వచ్చే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పత్తిని నమ్ముకున్న రైతులకు కష్టాలు తప్పేలా లేవని వాపోతున్నారు. ఈ ఏడాది అధిక వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగుల్చుతున్నాయని దిగాలు చెందుతున్నారు.

పత్తిదే ప్రథమ స్థానం

చేవెళ్ల డివిజన్ పరిధిలో వానాకాలంలో రైతులు సాగు చేసిన పంటల్లో పత్తిదే ప్రథమస్థానం. తర్వాత. వరి, మొక్కజొన్న, కంది, కూరగాయల సాగును ఎక్కువగా సాగుచేస్తున్నారు. డివిజన్ పరిధిలోని చేవెళ్ల, శంకర్‌పల్లి, మొయినాబాద్, షాబాద్ మండలాల్లో మొత్తం 33,481 ఎకరాల్లో పత్తిసాగు చేపట్టారు. వరి 16,887 ఎకరాల్లో, మొక్కజొన్న 5,589 ఎకరాలు, కంది 6,230, కూరగాయలు 6,500 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాల కారణంగా కూరగాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.

పత్తి సాగు వివరాలు

మండలం	ఎకరాలు
చేవెళ్ల	10,800
మొయినాబాద్	280
షాబాద్	13,505
శంకర్‌పల్లి	8,326

లాభాలు వస్తాయని ఆశించాం



ఈ ఏడాది పత్తి సాగుతో లాభాలు వస్తాయని ఆశించాం. ఆరు ఎకరాల్లో సాగు చేపట్టా. ఈ ఏడాది అప్పుల కష్టాలు తీరుతాయని భావించాం. అధిక వర్షాల కారణంగా పంట కళ్ల ఎదుటే పాడవుతోంది. ప్రస్తుతం పత్తి కాయ విప్పుకుంటోంది. పత్తి కాయలు నల్లబారుతున్నాయి. రూ.లక్షల పెట్టుబడి పెట్టాం. అప్పులు తీర్చే దారి కనబడడం లేదు.

– నర్సింలు, రైతు, ఆలూరు

కొంత మేర నష్టం



అధిక వర్షాల కారణంగా రైతులకు కొంత నష్టం వాటిల్లనుంది. ఇప్పుడిప్పుడే పత్తి కాయలు విప్పుకొంటున్నాయి. వానాకాలం ప్రారంభంలో వేసిన పంట పాడవుతుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆలస్యంగా సాగు చేపట్టిన వారికి కొంత వరకు మేలు చేకూరనుంది. ఇలాగే కొనసాగితే మాత్రం భారీ నష్టం వాటిల్లనుంది.

– సురేశ్, ఏడీఏ, చేవెళ్ల



పలుగుట్టలో రైతులకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

ప్రభుత్వ సహకారం అందిపుచ్చుకోవాలి

చేవెళ్ల: వ్యవసాయంలో రైతులు సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వాల సహకారాలను అందిపుచ్చుకోవాలని కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన వర్సిటీ విద్యార్థులు అన్నారు. మున్సిపల్ పరిధిలోని పలుగుట్టలో శుక్రవారం విద్యార్థులు క్షేత్రస్థాయి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా వారు రైతుల పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై హార్టికల్చర్ సమగ్రాభివృద్ధి మిషన్ ప్రయోజనాలను వివరించారు. ఈ పథకంతో రైతులకు ఆర్థికసాయం అందతుందని చెప్పారు. పండ్లు, కూరగాయలు, పూలు, ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాలు, తోట వృక్షాలు మొదలైన వాటి ఉత్పత్తి, ప్రాసెసింగ్ మార్కెటింగ్ అభివృద్ధి చేయటం పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. వ్యవసాధికారుల సలహాలుసూచనలు పాటించి వ్యవసాయంలో లాభాలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు వినూత్న, హర్షిత, ప్రేసి, కీర్తన, శివాణి, మేఘన, మానస, భావన, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ రాజీనామా

శంకర్‌పల్లి: పట్టణంలోని 18వ రేషన్ దుకాణదారుడు అనంతయ్య అనారోగ్య కారణాలతో తన డీలర్‌షిప్‌ని వదులుకోనున్నట్లు చేవెళ్ల ఆర్డీఓ చంద్రకళకు ఇటీవల రాజీనామా పత్రాన్ని అందించారు. ఈ మేరకు ఆర్డీఓ తుది నిర్ణయం తీసుకుని రాజీనామాని ఆమోదించారు. దీంతో శుక్రవారం తహసీల్దార్ సురేందర్ మాట్లాడుతూ.. తాత్కాలికంగా 35వ రేషన్ దుకాణంలో లబ్ధిదారులు తీసుకోవాలని సూచించారు.

గురుకుల హాస్టల్‌ను పరిశీలించిన ఎంఈఓ



హాస్టల్ విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రశేఖర్

షాద్‌నగర్‌రూరల్: చటాన్‌పల్లిలోని మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల వసతి గృహాన్ని శుక్రవారం కేశంపేట ఎంఈఓ చంద్రశేఖర్ పరిశీలించారు. హాస్టల్ విద్యార్థి హర్షవర్ధన్ ఫినాయిల్ బాటిల్‌లో తాగునీరు సేవించిన విషయాన్ని తెలుసుకున్న ఆయన హాస్టల్‌లో విద్యార్థులతో మాట్లాడారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి ఫినాయిల్ బాటిల్‌లో వాటర్ తాగిన విషయం గమనించి వెంటనే చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామని ప్రిన్సిపాల్ ప్రీతి ఎంఈఓకు వివరించారు.

బీసీల ఆత్మగౌరవం దెబ్బతీయడం సరికాదు

బీఆర్ఎస్ నేత యాదయ్యగౌడ్

కేశంపేట: బీసీల ఆత్మగౌరవం దెబ్బతీసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించడం సరికాదని బీఆర్ఎస్ నేత యాదయ్య గౌడ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించగా.. హైకోర్టు స్టే విధించడం బీసీలకు తీవ్ర నిరాశను కలిగించిందన్నారు. రాజ్యాంగ సవరణ జరగకుండా బీసీలకు రిజర్వేషనుల సాధ్యం కాదని తెలిసినా రాష్ట్ర ప్రభుత్వం జీఓ 9 తీసుకొచ్చి అన్యాయం చేసిందని అన్నారు. బీసీలంతా ప్రభుత్వం తిరగబడాలన్నారు. సమావేశంలో ఎల్.కుమార్‌గౌడ్ పాల్గొన్నారు.

కొత్త వ్యక్తులు కనిపిస్తే సమాచారమివ్వండి

యాచారం: వ్యవసాయ బావులు, పొలాల వద్ద ఉంచే గొర్రెలు, మేకలు, పాడి పశువుల చోరీలపై రైతులు జాగ్రత్తగా ఉండాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ సీఐ సత్యనారాయణ సూచించారు. పీఎస్ పరిధిలోని ఆకులామైలారం గ్రామంలో శుక్రవారం చోరీలు, కొత్త వ్యక్తుల సంచారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రాత్రి పూట గొర్రెలు, మేకలను ఎత్తుకెళ్లే దొంగల ముఠాపై రైతులు, కాపారులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే మందల వద్ద సోలార్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొత్త వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు.

నారాయణ ఆశయాలను కొనసాగిద్దాం

టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి నర్సింలుగౌడ్



నివాళి అర్పిస్తున్న టీఎస్ యూటీఎఫ్ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(యూటీఎఫ్) నాగటి నారాయణ ఆశయాలను కొనసాగిద్దామని ఆ సంఘం జిల్లా కార్యదర్శి నర్సింలు గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఆర్‌సీ భవనంలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో నాగటి నారాయణ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. నర్సింలు గౌడ్ మాట్లాడుతూ.. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పని చేసిన నాగటి నారాయణ బాల కార్మికుడిగా జీవితాన్ని ప్రారంభించి పేదరికాన్ని జయించి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విద్యను అందించారని అన్నారు. ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలపై పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టారని గుర్తు చేశారు. నారాయణను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, సత్యం, కృష్ణయ్య, కృష్ణ, సురేందర్, నర్సింలు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సభల్లో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మికులు

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లి దేవేందర్

చేవెళ్ల: తెలంగాణ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అల్లి దేవేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులతో కలిసి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవేందర్ మాట్లాడుతూ.. ఈ నెల 14, 15వ తేదీల్లో తుర్కయంజాల్‌లో నిర్వహించనున్న సభలో భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారని చెప్పారు. ఈ సభలకు మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ యూనియన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరేశ్, కోశాధికారి సిద్దమ్మ, ఉపాధ్యక్షుడు దస్తగిరి, కార్మికులు కిష్టయ్య, జనార్దన్, రంగ, రాఘవేందర్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించాలి

షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కొత్త కాలనీల అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మున్సిపల్ అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధి విస్తరిస్తున్నందున కొత్త కాలనీల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు. హెచ్ఎండీఏ నిధుల ద్వారా రూ.10 కోట్లతో మున్సిపల్ పరిధిలోని కొత్త కాలనీల్లో ప్రణాళికా బద్ధంగా వేగంగా చేపట్టాలని సూచించారు. సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయం, విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వం పట్టణాల అభివృద్ధిపై దృష్టి సారించి ఇందుకు ప్రత్యేక నిధులు సైతం మంజూరు చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, నాయకులు చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, బస్వం, తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లు సాధించే వరకు పోరాటం

బీసీ సేన జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి జయ



తహసీల్దార్‌కు జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీసీ సేన నాయకులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో శుక్రవారం బీసీ సేన ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీసీ సేన జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి జయ హాజరై మాట్లాడారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇవ్వకుండా కోర్టు స్టే విధించడం బాధాకరమన్నారు. 42 శాతం రిజర్వేషన్ ఇచ్చేవరకు తమ పోరాటం ఆగదన్నారు. బీసీలంతా ఐక్యమంగా ఉద్యమిస్తేనే రిజర్వేషన్ సాధించుకుంటామన్నారు. అనంతరం తహసీల్దార్ జగదీశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లేడ్ చౌదరిగూడ మండలాధ్యక్షుడు బోయ చెన్నయ్య, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆకాశ్ నాయక్, నాయకులు గిరిబాబు, దామోదర్, అనిత, వెంకటేశ్, సాగర్, బాలమణి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ఎంఈఓ మల్లయ్య తదితరులు

మండల విద్యాధికారి మల్లయ్య

మొయినాబాద్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని మండల విద్యాధికారి మల్లయ్య అన్నారు. మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం 69వ ఎస్‌జీఎఫ్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొత్త మాణిక్‌రెడ్డితో కలిసి ఎంఈఓ మల్లయ్య ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపుతాయన్నారు. అండర్–17, అండర్–14 విభాగాల్లో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ అనితారాణి, పీడీలు సుమ, నీరజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన తప్పనిసరి

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య



గర్భిణికి సీమంతం కార్యక్రమంలో సంధ్య తదితరులు

షాద్‌నగర్‌రూరల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య అన్నారు. పోషణమాసంలో భాగంగా శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల గ్రామంలోని ప్రగతి రూరల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో అన్నారం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషక ఆహారంపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసం, అన్న ప్రాసన, జన్మదిన వేడుకలు, సీమంతాల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య హాజరై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆండాలు మాట్లాడుతూ.. పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. చిరుధాన్యాలు, పప్పులు, ఆకుకూరలు, పండ్లు, గుడ్లు, పాలు తదితర పదార్థాల్లో పోషక విలువలు మెండుగా ఉంటాయని చెప్పారు. పోషకాహారంపై ప్రతీ ఒక్కరికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగతి రూరల్ డెవలప్‌మెంట్ సీనియర్ మేనేజర్ మురళీకృష్ణ, ఎడ్యుకేషన్ మేనేజర్ జగదీశ్, సిబ్బంది శంకర్, నవ్య, మెడికల్ ఆఫీసర్ రాఘవేంద్ర, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

పల్స్ పోలియోను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న సీహెచ్ఓ వెంకట్‌రెడ్డి

మండల వైద్యారోగ్య కేంద్రం సీహెచ్ఓ వెంకట్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: పల్స్‌పోలియో విజయవంతానికి అధికారులు, సిబ్బంది సమష్టిగా పనిచేయాలని మండల వైద్యారోగ్య కేంద్రం సీహెచ్ఓ వెంకట్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మండల ఆరోగ్య వైద్య కేంద్రంలో ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, నర్సులకు ఈ నెల 12న చేపట్టనున్న పల్స్ పోలియోపై మండల వైద్యాధికారి ప్రత్యూష ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పోలియో రహిత సమాజమే లక్ష్యమన్నారు. ఈ నెల 12, 13వ తేదీల్లో పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందని 0–5 సంవత్సరాలలోపు పిల్లలకు తల్లిదండ్రులు పోలియో చుక్కలు వేయించాలన్నారు. మండల పరిధిలో 35 పల్స్ పోలియో బూత్‌లు ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలియో చుక్కలు వేస్తారని చెప్పారు. బూత్‌కు నలుగురు చొప్పున సిబ్బంది ఉంటారన్నారు. మేజర్ గ్రామాల్లో రెండు బూత్‌లు ఏర్పాటు చేశామని వివరించారు. మండల పరిధిలో 6,748 మంది చిన్నారులున్నారన్నారు. 12వ తేదీన గ్రామాల్లో బూత్‌లలో పల్స్ పోలియో కార్యక్రమం ఉంటుందని 13, 14వ తేదీల్లో ఇంటింటికి తిరిగి వేయాలన్నారు.